సాక్షి
గుంటూరు
ఆదివారం । 23 । జూన్ । 2024



### రైతులకు సన్మానం

వినుకొండ(నూజెండ్ల): ఏరువాక పౌర్ణమి పండుగ ముగింపు సందర్భంగా నూజెండ్ల మండలం ఉప్పలపాడులో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు కుటుంబాలను సత్కరించారు.



### బండ్లమ్మ సేవలో..

పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో ఉన్న బగళాముఖి అమ్మవారి దేవాలయాన్ని హైకోర్టు ప్రోటోకాల్ రిజిస్ట్రార్ రాఘవస్వామి కుటుంబ సమేతంగా సందర్శించారు.



### సామూహిక హారతులు

నగరం: జిల్లేపల్లిలో ఉన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామూహిక హారతులు నిర్వహించారు.

# ఫిట్‌నెస్ నిల్.. నిర్లక్ష్యం ఫుల్!

- పిల్లల ప్రాణాలతో విద్యాసంస్థల చెలగాటం
- నిబంధనలకు నీళ్లొదిలిన యాజమాన్యాలు
- ఇష్టారాజ్యంగా వాహనాల నిర్వహణ
- అధికారుల తనిఖీలతో వెలుగులోకి వాస్తవాలు
- 1,300 బస్సులకుగాను 650కే అనుమతులు
- ఇకనైనా జాగ్రత్తలు తీసుకోకుంటే బస్సులు సీజ్



తనిఖీలు నిర్వహిస్తున్న ఆర్టీఏ అధికారులు

**పట్నంబజారు** : ఒక చిన్నారి బడికి వెళ్తుంటే కన్న వారికే కాదు.. ఆ కుటుంబమంతా ఎంతో సంతోషపడుతుంది. ఎప్పుడెప్పుడు పాఠశాల నుంచి పిల్లలు ఇంటికి వస్తారా అని ఎదురుచూస్తుంటారు. వారికి ఏ లోటూ రాకుండా సర్వం సిద్ధం చేసి పంపుతుంటారు. అలాంటి చిన్నారులే కాదు కళాశాలకు తమ పిల్లలను పంపుతున్న తల్లిదండ్రులు కూడా వారి భద్రత కోసమే రూ.వేల ఫీజులకు వెనుకాడకుండా ఆయా విద్యాసంస్థల బస్సులకే ప్రాధాన్యం ఇస్తుంటారు. కానీ చాలా యాజమాన్యాలు మాత్రం డబ్బుకు ఇచ్చిన విలువ విద్యార్థుల భద్రతకు ఇవ్వడం లేదు. దీనికి నిదర్శనమే ఇటీవల రవాణాశాఖ అధికారుల తనిఖీల్లో పలు బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేదని తేలడం. ఇకనైనా తీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

### అంతా అడ్డగోలుగా..

విద్యా సంస్థలు నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నాయి. పూర్తి స్థాయిలో చట్టాలను అతిక్రమిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతూ నిబంధనలకు నీళ్లొదిలేస్తున్నాయి. అధికారులు చెబుతున్న మాటలను కూడా పెడచెవిన పెడుతున్నాయి. ఈ నెల 12వ తేదీ నుంచి విద్యా సంస్థలు ప్రారంభమయ్యాయి. స్కూళ్లు, కళాశాలలకు సంబంధించి అనేక దూర ప్రాంతాల నుంచి విద్యార్థులను వారి తల్లిదండ్రులు బస్సుల ద్వారా పంపిస్తుంటారు. ఈ క్రమంలో గత నెల 15వ తేదీన ఏడాదికి సంబంధించి నిబంధనల ప్రకారం ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు (ఎఫ్‌సీ) జారీ చేసే గడువు ముగిసింది. జిల్లాలో మొత్తం 1,300కు పైగా కళాశాల, పాఠశాలల బస్సులు ఉన్నాయి. వీటితోపాటు మరో 300 బస్సులు 15 సంవత్సరాలు దాటినవి. గత నెల 16వ తేదీ నుంచే రోడ్డు ట్రాన్స్‌పోర్టు అథారిటీ (ఆర్టీఏ) అధికారులు ఎఫ్‌సీలు జారీ చేయడం ప్రారంభించారు. నిబంధనలు ఏమాత్రం పట్టించుకోని పలు విద్యా సంస్థలు ఎఫ్‌సీలు పొందలేదు. సుమారు 1,300 బస్సులకు సంబంధించి 650 వాహనాలకు అనుమతులు తీసుకోకుండానే నడిపేస్తున్నారు. నిబంధనల ప్రకారం తీసుకోవాల్సిన చర్యలను సైతం పెడచెవిన పెడుతున్నారు. రూల్ నంబరు 185(ఎఫ్) ప్రకారం కచ్చితంగా నిబంధనలు పాటించాల్సి ఉన్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

### జిల్లా వ్యాప్తంగా తనిఖీలు

చాలా విద్యా సంస్థల యాజమాన్యాలు ఈ నిబంధనలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇటీవల కాలంలో అధికారులు చేస్తున్న ప్రత్యేక తనిఖీల్లో ఇవి తేటతెల్లమవుతున్నాయి. విద్యా సంస్థల యాజమాన్యాలు నిబంధనలు విస్మరించడంతో ఆర్టీఏ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. బృందాలుగా మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లతో కూడిన బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. వారం వ్యవధిలోనే 62 కేసులు నమోదు చేయడం గమనార్హం. వాటిలో ఎఫ్‌సీలు లేని వాహనాలు 30. అరవై ఏళ్లు పైబడిన వృద్ధులు నడుపుతున్న వాహనాలు 3 అని తేలింది. నిబంధనలకు అనుగుణంగా సామగ్రి లేనివి ఇతరత్రా విద్యా సంస్థల బస్సులపై కేసు నమోదు చేశారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడుపుతున్న ఐదుగురు డ్రైవర్లను గుర్తించారు. 15 సంవత్సరాలకు పైగా స్క్రాప్‌నకు పంపాల్సిన వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎఫ్‌సీలు లేకుండా రోడ్డెక్కితే కేసు నమోదు చేయడంతోపాటు వాహనాలు సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

### నిబంధనలు ఇలా..

- ఆర్టీఏ రూల్ నంబరు 185(ఎఫ్) ప్రకారం 60 సంవత్సరాల వయో పరిమితి దాటిన వ్యక్తి స్కూల్ బస్సు డ్రైవింగ్‌కు అనర్హుడు.
- డ్రైవర్ ప్రతి మూడునెలలకొకసారి కచ్చితంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. ఆయా విద్యా సంస్థల ప్రతినిధులు సంబంధిత వైద్య రికార్డులను భద్రపరచాలి.
- డ్రైవర్ల నియామకం గురించి ఆర్టీఏ అధికారులకు తెలియజేయాలి.
- ఐదు సంవత్సరాల అనుభవం, తప్పనిసరిగా హెవీ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలి.
- కళాశాల, స్కూల్ ప్రిన్సిపల్, విద్యార్థుల తల్లిదండ్రులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసి ప్రతి నెలా వాహనాల స్థితిగతులను పరిశీలించాలి. ఒక రిజిస్టరు ద్వారా ప్రతి అంశాన్ని నమోదు చేయాలి.
- ప్రతి వాహనంలో ఫిర్యాదు పుస్తకాన్ని అందుబాటులో ఉంచాలి.
- బస్సులో అత్యవసర ద్వారం, ఫస్ట్ ఎయిడ్ బాక్సు, అగ్నిమాపక పరికరం, బ్యాగులు భద్రపరుచుకునే బాక్సు ఏర్పాటు చేయాలి.
- తప్పనిసరిగా సబ్ రూల్ ఏ, బీ ప్రకారం బస్సులో ఆయా విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేయాలి.

### నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు



విద్యా సంస్థల ఎఫ్‌సీలకు సంబంధించి గత నెల 15వ తేదీతోనే గడువు ముగిసింది. ఈ నెల 12వ తేదీన విద్యా సంస్థలు ప్రారంభమైన నేపథ్యంలో నెల వ్యవధిలో కూడా పలు విద్యా సంస్థల యాజమాన్యాలు ఎఫ్‌సీలు చేయించుకోలేదు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నాం. విద్యా సంస్థల యాజమాన్యాలు తప్పనిసరిగా ఎఫ్‌సీలు తీసుకోవడంతోపాటు ప్రతి నిబంధనను కచ్చితంగా పాటించాలి.

– షేక్ కరీం, డీటీసీ

## రైల్వే శాఖలో పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి

- డీపీఆర్‌లు త్వరగా సిద్ధం చేయాలి
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి

**గుంటూరు వెస్ట్** : రాష్ట్రంతోపాటు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన పనులను త్వరగా పూర్తి చేయాలని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక రోడ్లు, భవనాలు అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి, రైల్వే శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ ఇన్నర్ రింగ్‌రోడ్డు, పెదపలకలూరు, మంగళగిరి, గుంటూరు శంకర్‌విలాస్, నెహ్రూనగర్, సంజీవయ్యనగర్ ప్రాంతాల్లో ఉన్న రైల్వే గేటు వద్ద ఓవర్‌బ్రిడ్జిల నిర్మాణం, శ్యామలానగర్ రైల్వే అండర్‌బ్రిడ్జి నిర్మాణాలకు అనుమతుల వివరాలు తెలుసుకున్నట్లు చెప్పారు. నందివెలుగు రోడ్డులోని రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనుల వివరాలపై సమీక్షించారు. పనుల వారీగా అనుమతుల మంజూరుకు రైల్వే శాఖ, ఆర్ అండ్ బీ, స్థానిక సంస్థల కలిసి పూర్తి చేస్తాయన్నారు. జిల్లాలో 15 వరకు రైల్వే బ్రిడ్జిలు రూ. వెయ్యి కోట్ల నుంచి రూ. 2 వేల కోట్ల పనులకు ఇప్పటికే డీపీఆర్ రూపొందించారన్నారు.వందేభారత్ రైలు తెనాలిలో నిలిపేలా, బెంగళూరుకు పగటిపూట గుంటూరు నుంచి రైలు సౌకర్యం కల్పించే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. సమావేశంలో రైల్వే డివిజనల్ మేనేజర్ రామకృష్ణ, ఆర్ అండ్ బీ ఎస్‌ఈ శ్రీనివాసమూర్తి, శేషశ్రీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### గుంటూరు జిల్లా కలెక్టర్‌గా నాగలక్ష్మి సెల్వరాజన్

బాపట్ల కలెక్టర్ కర్నూలుకు బదిలీ



**సాక్షి ప్రతినిధి, గుంటూరు** : గుంటూరు జిల్లా కలెక్టర్‌గా 2012 బ్యాచ్‌కు చెందిన నాగలక్ష్మి సెల్వరాజన్‌ను నియమిస్తూ ప్రభుత్వం శనివారం రాత్రి ఆదేశాలు జారీ చేసింది. ఆమె ప్రస్తుతం విజయనగరం కలెక్టర్‌గా పని చేస్తున్నారు. అంతకుముందు అనంతపురంలోనూ విధులు నిర్వర్తించారు. గతంలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా పని చేశారు. ప్రస్తుత కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డిని జీఏడీలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ అయ్యాయి. ఆయన 2022లో జిల్లాల పునర్ విభజన తర్వాత గుంటూరు జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. రెండు సంవత్సరాల రెండు నెలల కాలంలో జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లడంలో విశేషంగా కృషి చేశారు. బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాను కర్నూలు జిల్లా కలెక్టరుగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో జాయింట్ కలెక్టర్‌కు బాధ్యతలు అప్పగించారు.

### లింగ నిర్ధారణ చట్టాన్ని అమలు చేయాలి

– జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి

**గుంటూరు వెస్ట్** : గర్భస్థ లింగ నిర్ధారణ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన చట్టం జిల్లా స్థాయి అథారిటీ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో నమోదు అయ్యే కొత్త, రెన్యూవల్ స్కానింగ్ సెంటర్లను తప్పనిసరిగా ప్రోగ్రామ్ అధికారులు తనిఖీ చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 283 గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షా కేంద్రాలు ఉన్నాయన్నారు. వాటిలో నాలుగు రెన్యూవల్ , 12 మోడిఫికేషన్, రెండు క్యాన్సిలేషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. తెనాలి డివిజన్‌లో 25 స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించామన్నారు. చట్టాన్ని ఉల్లంఘించే ఎవరినీ ఉపేక్షించవద్దని కలెక్టర్ ఆదేశించారు.

### 28న మెగా జాబ్ మేళా




**నెహ్రూనగర్** : సమర్థనం దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు 28వ తేదీన మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు గుంటూరు అమరావతి రోడ్డులోని హిందూ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో మేళా ఉంటుంది. ఈ మేరకు సమర్థనం రీజినల్ మేనేజర్ ఎంఆర్‌కే పరమహంస తెలిపారు. శనివారం అమరావతి రోడ్డులో మేళాకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు చేతుల మీదుగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులల కోసం పనిచేస్తున్న సమర్థనం ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ మేళాను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 18– 35 ఏళ్ల వయసు కలిగి పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ చదివిన వారికోసం 30కి పైగా కంపెనీలు మేళాలో ఎంపికలు నిర్వహిస్తాయని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు రెస్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హత ధ్రువపత్రాలు తీసుకొని 28న నేరుగా హాజరు కావాలని కోరారు. వివరాలకు 63648 67800, 63648 67801, 63648 67802, 63648 67803 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### స్టూడెంట్ కిట్లను త్వరగా పంపిణీ చేయండి

డీఈవో పి.శైలజ

**తెనాలి అర్బన్**: స్టూడెంట్ కిట్స్‌ను త్వరగా పంపిణీ చేయాలని జిల్లా విద్యాశాఖాధికారిణి పి.శైలజ ఆదేశించారు. తెనాలి మండలం కొలకలూరు, నందివెలుగు, ఖాజీపేటలోని జిల్లా పరిషత్ హైస్కూల్స్‌ను శనివారం ఆమె పరిశీలించారు. కిట్స్ పంపిణీపై ఆరా తీశారు. అలాగే మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని సూచించారు. ఆమె వెంట ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ, పలువురు ఉపాధ్యాయులు ఉన్నారు.

## ‘పాత’ కొనుగోలుకు పత్రాలే కీలకం



ద్విచక్ర వాహనాలు

- వాహనాల విషయంలో జాగ్రత్తలు అవసరం
- అన్నీ సక్రమంగా ఉన్నాకే నగదు లావాదేవీలు

**పట్నంబజారు**: ఇటీవల కాలంలో ఆనందపేటలో నివాసం ఉండే ఓ యువకుడు ద్విచక్రవాహనాన్ని వేరే వ్యక్తి వద్ద కొనుగోలు చేశాడు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు నాకా బందీ నిర్వహించారు. ఆ సమయంలో ద్విచక్ర వాహనానికి సంబంధించిన పత్రాలు అతడి పేరుపై ఉండకపోవడం.. సంబంధిత యజమాని అందుబాటులో లేకపోవడంతో ఆ వాహనాన్ని స్టేషన్‌కు తరలించి పూర్తి వివరాలు సేకరించారు. కొత్త వాహనాల కొనుగోళ్లు పెరుగుతున్నాయి. అదే సందర్భంలో పాత వాహనాల విక్రయాలు కూడా అంతే జరుగుతున్నాయి. ఇతరులకు విక్ర యించినట్లు సేల్ అగ్రిమెంట్ , ఇతర పత్రాలన్నీ సరిగా చూసుకోకుంటే ఆ తర్వాత లేనిపోని చిక్కుల్లో పడాల్సి వస్తుంది. ఇటీవల పోలీసులు ఈ–చలానా విధిస్తుండటంతో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాత వాహనాన్ని అమ్మిన సమయంలో చిన్న బాండు పేపర్‌తో అమ్మకం గురించి ఒప్పందాలు చేసుకుని విక్రయిస్తారు. వాహనాన్ని కొన్న వ్యక్తి తన పేరుపై రిజిస్ట్రేషన్ చేసుకోకుండా అలాగే నడిపిస్తే అమ్మిన వ్యక్తికి ఈ–చలానా భారం పడుతుంది. ఈ విషయాన్ని వారు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా వినే పరిస్థితి ఉండరు. కాగితాలను చూస్తేగాని నమ్మరు. అలాంటప్పుడు సేల్ డీడ్ అగ్రిమెంట్ కాగితాలు ఉండడం మంచిది. సరైన అవగాహన లేకపోవడంతో చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. అమ్మిన వారేగాక కొన్న వారు కూడా చిక్కులను ఎదుర్కోవాల్సి వస్తోంది.

**జోరుగా మారు బేరాలు**

నగరాలు, పట్టణాలతోపాటు ఇటీవల మండల స్థాయిలో కూడా వాహనాల అమ్మకాలు, కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి.మధ్యవర్తుల ఆధ్వర్యంలో ఇష్టం వచ్చినట్లు క్రయవిక్రయాలు సాగిస్తున్నారు. కొనుగోలు చేసిన వారు వారం, పది రోజుల్లోపు యాజమాన్య హక్కులను మార్చుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఆలస్యం చేస్తే అధికారులు జరిమానాలు విధించే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

**29, 30 ఫారాలే ముఖ్యం**

వాహనం కొన్న వెంటనే ఆర్సీ, బీమా, కాలుష్యం, చిరునామా లాంటి ధ్రువీకరణ పత్రాలపై సంతకాలు చేయించుకోవడం చాలా ముఖ్యమని అధికారులు సూచిస్తున్నారు. వాటితోపాటు ఫారం 29 రెండు కాపీలు, ఫారం 30పై విక్రయించిన వారి సంతకాలు తీసుకుంటే యాజమాన్య హక్కుల బదిలీ సులభమవుతుంది. పాతవాహనం అమ్మేశాక యాజమాన్య హక్కులు బదిలీ చేసుకోకపోతే కష్టాలు తప్పవు. కొత్తగా మరో వాహనం కొన్నప్పుడు అదనపు ఇబ్బందులు ఎదురుకావు. ఈ విషయంపై అవగాహన లేకపోవడంతో ఎక్కువ పన్నులు చెల్లిస్తూనే ఉన్నారు. వాహనాన్ని అమ్మిన వెంటనే ఇరువైపులా యాజమాన్య హక్కులను మార్చుకోవాలి.

### కొన్న వెంటనే మారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



పాత వాహనాలు కొన్న వెంటనే ఆర్సీ, బీమా, కాలుష్యం, చిరునామా లాంటి ధ్రువీకరణ పత్రాలపై సంతకాలు చేయించుకుని పేరు, చిరునామా మార్చుకోవాలి. ఇది చాలా ముఖ్యం. తప్పనిసరిగా కొనుగోలుదారుడు చూసుకోవాలి. లేకపోతే అనేక సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు లేకపోలేదు. వాహనానికి సంబంధించి ఏదైనా ప్రమాదం జరిగినా, ఏదైనా ఘటన జరిగినా వాహనదారుడు కూడా అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పూర్తిస్థాయిలో నిబంధనలు పాటించాలి.

– ఎన్.గోపాల్, ఇన్‌చార్జి ఆర్టీఓ, గుంటూరు

### పత్రాలు లేకుండా వాహనాలు కొనవద్దు..



సెకండ్ హ్యాండ్ వాహనాలు కొనుగోలు చేసేటప్పుడు, సరైన పత్రాలు ఉన్నాయా, లేవా అనేది సరిచూసుకోవాలి. ట్రాఫిక్ చలానాలు లేకుండా ఉండే వాహనాలు కొనుగోలు చేయాలి. సరైన పత్రాలు లేకుండా కేసులు పడతాయి. వాహనం కొనుగోలు చేసిన వెంటనే వారిపేరుపై మార్చుకోవాలి. ఎటువంటి సమస్యలు లేకుండా ప్రతి ఒక్క వాహనదారుడు ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉంటే పోలీసులు కేసులు నమోదు చేయరు.

– బి.కోటేశ్వరరావు, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ, గుంటూరు

## డెంగీ.. కొంచెం జాగ్రత్తండీ..!

- జ్వర విజృంభణకు అవకాశం
- జిల్లాలో ఇప్పటికే 109 కేసులు
- మరో 2 నెలలు పెరిగే అవకాశం
- అత్యవసరమైతేనే రోగికి ప్లేట్‌లెట్లు
- అపోహలు వద్దంటున్న వైద్య నిపుణులు



**గుంటూరు మెడికల్** : డెంగీ జ్వరం విషయంలో ఎంత జాగ్రత్తగా ఉంటే అంత సురక్షితంగా కోలుకోవచ్చు. వ్యాధికి కారణం, లక్షణాలు తదితరాలపై అవగాహన పెంచుకుంటే అసలు డెంగీ బారిన పడకుండా చూసుకోవచ్చు. జ్వరం వచ్చినా వైద్యులను సంప్రదించి తగిన ఔషధాలు వాడితే త్వరగా కోలుకోవచ్చని వైద్యనిపుణులు చెబుతున్నారు.

వర్షాకాలం వచ్చిందంటే పలు రకాల వ్యాధులు దాడి చేసేందుకు సిద్ధంగా ఉంటాయి. వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెంది పలురకాల వ్యాధులను వ్యాపింపచేస్తాయి. దోమ కాటుతో ప్రజలు వివిధ జ్వరాల బారిన పడే అవకాశం ఉంది. వాటిల్లో ముఖ్యంగా డెంగీ జ్వరం. దీనిని సకాలంలో గుర్తించి చికిత్స తీసుకోకపోతే ప్రాణాలకే ప్రమాదం. వ్యాధి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో సురక్షితం. ఈ నేపథ్యంలో మీ కోసం ‘సాక్షి’ అందిస్తున్న ప్రత్యేక కథనం.

**అవగాహన లేకుంటే ఇల్లు, ఒళ్లు గుల్లే...**

కరోనా ప్రారంభమైనప్పటి నుంచి జ్వరం పేరు చెబితేనే ప్రజలు హడలెత్తిపోతున్నారు. కరోనా ప్రారంభం కాకముందే డెంగీ జ్వరం ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. పలువురు అవగాహన లేకుండా సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల మృతి చెందిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. డెంగీ జ్వరంపై ప్రజలకు అవగాహన లేకపోతే ఇల్లు, ఒళ్లు గుల్ల కావాల్సిందే. కొన్ని ఆస్పత్రుల్లో ప్లేట్‌లెట్స్ పేరిట జ్వరం బాధితుల నుండి రూ.లక్షల్లో రుసుము వసూలు చేస్తున్నారు. డెంగీపై అవగాహన కలిగి ఉండి కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే జ్వరం బారిన పడకుండా ఉండొచ్చు.

**దోమలు పెరిగే ప్రదేశాలు...**

డెంగీ జ్వరాన్ని కలుగజేసే దోమలు మంచి నీటిని నిల్వచేసే ప్రదేశంలో పెరుగుతాయి. వాడి పారేసిన వస్తువులు, నిలువ ఉండే నీటిలో దోమ పిల్లలు కదులుతూ ఉంటాయి. నీటిని నిల్వచేసే డ్రమ్ములు, తొట్టెలు, గాబులు, రుబ్బురోళ్లు, వాడి పారేసిన టైర్లు, టీ కప్పులు, ప్లాస్టిక్ కప్పులు, వాడి పారేసిన కొబ్బరి చిప్పలు, బోండాలు, ఫ్రిజ్, ఎయిర్ కూలర్స్ వెనుక భాగాల్లో, పూల కుండీలు, ఓవర్ హెడ్ ట్యాంకులు, నీటి సంపుల్లో దోమ లార్వాలు పెరుగుతాయి.

### జ్వరం లక్షణాలు....

- పగటి వేళల్లో కుట్టే ఎడిస్ ఈజిప్ట్ అనే దోమకాటు వల్ల డెంగీ జ్వరం వస్తుంది.
- జ్వరం వచ్చినప్పుడు వాంతులు, తలనొప్పి, కంటి గుడ్డు కదిలినప్పుడు నొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, వాంతి అయినట్లు అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఒంటిపై ఎర్రటి గుల్లలు ఏర్పడి, ప్లేట్‌లెట్స్ తగ్గిపోయి ఒక్కోసారి రక్తస్రావం జరుగుతుంది. రక్తపరీక్ష చేసి ఎలీసా పద్ధతిలో డెంగీ జ్వరాన్ని నిర్ధారణ చేస్తారు.

**జిల్లాలో బాధితులు....**

జిల్లాలో 2021లో 447 మంది, 2022 –168, 2023– 375, 2024 జూన్ 10వ తేదీ వరకు 109 మంది డెంగీ జ్వరం బారిన పడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటే మున్సిపాలిటీలు, గుంటూరు కార్పొరేషన్ పరిధిలోనే ఎక్కువగా కేసులు నమోదు అవుతున్నాయి. గుంటూరు, సత్తెనపల్లి, మంగళగిరి, పొన్నూరు, తెనాలి, తదితర ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి.

### ప్లేట్‌లెట్ల విషయంలో కంగారొద్దు



ఎలాంటి జ్వరం వచ్చినా ప్లేట్‌లెట్స్ తగ్గటం సహజం. అంత మాత్రానికే రోగులు కంగారు పడకూడదు. సాధారణంగా రక్తంలో 2 లక్షల నుండి 4.5 లక్షల ప్లేట్‌లెట్స్ ఉంటాయి. వీటి సంఖ్య 40 వేల కన్నా తక్కువగా ఉన్నప్పటికీ ఎలాంటి ప్రమాదం సంభవించదు. బీపీ తగ్గి, కిడ్నీల పనితీరు తగ్గిపోయి, శరీరంపై ఎర్రటి దద్దుర్లు ఏర్పడి అవి పగిలి వాటి ద్వారా రక్తం బయటకు రావటం, మూత్రంలో, దగ్గుతున్నప్పుడు కళ్లె ద్వారా రక్తం పడిపోతూ ఉంటే అప్పుడు మాత్రమే ప్లేట్‌లెట్స్ ఎక్కించాల్సి ఉంటుంది.

–డాక్టర్ కోగంటి కళ్యాణ్‌చక్రవర్తి, జ్వరాల స్పెషలిస్టు, గుంటూరు

### ఉచితంగా వైద్య సేవలు



జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డెంగీ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నాం. ప్రతిరోజూ వైద్య సిబ్బందిని ప్రైవేటు ఆస్పత్రులకు పంపించి వివరాలు సేకరిస్తున్నాం. ప్రజలు జ్వరాలపై, ప్లేట్‌లెట్స్‌పై ఉన్న అపోహలు వీడి తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలకు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

– డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, గుంటూరు

## భానుడి చుట్టూ రంగుల వలయం



సూర్యుడి చుట్టూ ఏర్పడిన వలయం

**తెనాలి** : ఆకాశంలో శనివారం సూర్యుడి చుట్టూ గంటసేపు రంగులతో కూడిన వలయం ఏర్పడింది. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన బాలసాహితీవేత్త షేక్ అబ్దుల్ హకీంజాని ఈ అద్భుత దృశ్యాన్ని తన కెమెరాతో బంధించారు. ఉదయం 9 – 12 గంటల వరకు ఆకాశంలో సూర్యుడి చుట్టూ కనిపించిన ఈ వలయాన్ని చూసిన స్థానికుల సంబరపడ్డారు. ఈ వలయాన్ని ‘సన్ హాలో’ లేదా ‘22 డిగ్రీ హాలో’ అని పిలుస్తారు. వాతావరణంలో ఉండే లక్షలాది షట్బుజాకారపు మంచు స్ఫటికాల గుండా కాంతి ప్రయాణించినపుడు వక్రీభవనం చెందటం వల్ల ఈ వలయాలు ఏర్పడతాయి. సూర్యుడి చుట్టూ దాదాపు 22 డిగ్రీల వ్యాసార్థంతో వలయం ఏర్పడుతుంది. అందుకే దీనిని ‘22 డిగ్రీ హాలో’ అంటారు. దీనిని ‘వరదగూడు’గానూ పిలుస్తారు. ఇలా ఏర్పడిన తర్వాత వారంలో భారీ వర్షాలు కురుస్తాయని అంటారు.

### రైల్వే గేటు మూసివేత

**తాడేపల్లి రూరల్**: మంగళగిరి నగరపాలక సంస్థ పరిధిలోని ఇప్పటం – మంగళగిరి మధ్య లెవల్ క్రాసింగ్ గేట్‌ను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 24 నుంచి 27వ తేదీ వరకు పెదవడ్లపూడి – కృష్ణాకెనాల్ జంక్షన్ మధ్య మూడో రైల్వే బెడ్ ఏర్పాటు చేయనున్నామని పేర్కొన్నారు. ఈ రెండు జంక్షన్‌ల మధ్య ఉన్న ఇప్పటం – మంగళగిరి మధ్య లెవల్ క్రాస్ గేటును తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని వివరించారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్రాసింగ్ గేట్ మూసివేస్తామని చెప్పారు.

## క్లుప్తంగా

### లాంఫాంలో ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు



గుంటూరు రూరల్: ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లాంఫాంలో శనివారం ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో జోడెద్దులను అలంకరించి కట్టి దుక్కి దున్నారు. పుడమి తల్లిని పూజించారు. అరకతో పొలం దున్ని కంది విత్తనాలు నాటారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి పంటలు పండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విస్తరణ సంచాలకురాలు డాక్టర్ బి.ప్రమీలారాణి, హోమ్‌సైన్స్ డీన్ డాక్టర్ బి. శ్రీలక్ష్మి, అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎస్‌వీవీఎస్ దుర్గాప్రసాద్, డాక్టర్ శ్రీలత, శాస్త్రవేత్తలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి



జాకిర్ (ఫైల్)

మంగళగిరి: పట్టణ పరిధిలోని కాజా ఐజేఎం విల్లాస్‌లో విద్యుత్ షాక్‌కు ఎలక్ట్రీషియన్ మృతి చెందాడు. శనివారం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నవ్వులూరుకు చెందిన షేక్ జాకిర్ (35) ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఐజేఎం విల్లాస్‌లో ఏసీ మరమ్మతులు చేసేందుకు వెళ్లాడు. పని చేస్తున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఎన్నారైకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. జాకిర్‌కు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

### మహిళల మెడలోని గొలుసులు చోరీ

మంగళగిరి: పట్టణంలోని రత్నాలచెరువు సమీపంలో చైన్‌స్నాచింగ్ జరిగింది. శనివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరలక్ష్మి అనే వృద్ధురాలు ఇంటి ముందు నిలబడి ఉండగా గుర్తుతెలియని యువకుడు అటుగా వచ్చాడు. అకస్మాత్తుగా వృద్ధురాలిపై దాడిచేశారు. ఆమె మెడలోని సుమారు రూ. 2 లక్షలు విలువ చేసే బంగారు చైన్ లాక్కొని ద్విచక్రవాహనంపై పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

#### మరో ఘటనలో...

పట్నంబజారు: మహిళ మెడలో నుంచి గొలుసు లాక్కొని పరారైన సంఘటనపై కేసు నమోదైంది. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీనగర్‌కు చెందిన నూతలపాటి రాజ్యలక్ష్మి గుడికి వెళుతున్న సమయంలో కట్టవారివీధిలో ద్విచక్రవాహనంపై వచ్చిన ఓ యువకుడు ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లాడు సుమారు 20 గ్రాముల గొలుసు లాక్కొని పరారైనట్లు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# డయేరియా బాధితులకు మెరుగైన వైద్య సేవలు

- 24 గంటల పాటు వైద్యశిబిరాలు
- డీఅండ్‌హెచ్‌వో రవి



ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రవి

దాచేపల్లి: డయేరియా బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని డీఅండ్‌హెచ్‌వో బి.రవి అన్నారు. మండలంలోని కేసానుపల్లి గ్రామంలో డయేరియా ప్రబలడంతో శనివారం ఆయన పర్యటించారు. డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిసరాలు పరిశీలించారు. అనంతరం బాధితులను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉన్న మంచినీటి బోరుని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ.. ఆహార పదార్థాల వల్లే డయేరియా (అతిసార) ప్రబలే అవకాశం లేదని, తాగునీటి వల్లే అవకాశం ఉందన్నారు. కాలనీ వాసులు ఉపయోగించే మంచినీటి బోరు శ్యాంపిల్స్ తీసి ల్యాబ్‌కి పంపించి పరీక్ష చేయిస్తే నెగిటివ్ వచ్చిందని, మరోసారి ల్యాబ్‌కి పంపిస్తామని ఆయన చెప్పారు. ఇప్పటి వరకు 11 మంది అతిసార బారిన పడినట్లుగా గుర్తించామని, పలువురు ప్రైవేట్ హాస్పిటల్స్‌లో చికిత్స పొందుతున్నారని ఆయన వివరించారు. వంగూరి నాగమ్మ, వినుకొండ అవ్వమ్మ ఆరోగ్య పరిస్థితి కాస్త ఇబ్బందిగా ఉందని, మిగతా బాధితులకు ఎటువంటి ఇబ్బందులు లేవని ఆయన తెలిపారు. 24 గంటల పాటు వైద్య సేవలు అందించేలా సిబ్బందిని అందుబాటులో ఉంచామని, అతిసార బారినపడితే తక్షణ వైద్యసేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. అతిసార ప్రబలకుండా మురికి కాలువల్లో పూడికలు తీయించేలా చర్యలు తీసుకున్నామన్నారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని ఆయన సూచించారు. డీఅండ్‌హెచ్‌వో వెంట ఎంపీడీవో వెంకట రమణ, ఈవోపీఆర్డీ జోషిబాబు, డాక్టర్లు ఇమ్మడిశెట్టి అమూల్య, మధు, సర్పంచ్ శ్రీపతి ప్రసాద్, ఎంపీటీసీ చెట్టిపాగు ఏసుదాసు, నాయకులు నెల్లూరి రామకోటయ్య, పంచాయతీ కార్యదర్శి నాగెండ్ల రత్నం, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.



పారిశుద్ధ్య పనులు చేస్తున్న దృశ్యం

#### మరో ఐదు అతిసార కేసులు

మండలంలోని కేసానుపల్లి గ్రామంలో కొత్తగా ఐదు అతిసార కేసులు శనివారం నమోదయ్యాయి. గ్రామానికి చెందిన పల్లపు శివనాగదుర్గ, తుపాకుల అరవింద్, వినుకొండ యాకోబు, కొమ్ము అనూష, మీసాల మరియమ్మ అతిసార వ్యాధి బారిన పడ్డారు. బాధితులు ప్రభుత్వ, ప్రైవేట్ హస్పిటల్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఎస్సీ కాలనీలోని చర్చిలో ప్రత్యేకంగా వైద్యశిబిరం ఏర్పాటు చేసి ప్రాథమిక వైద్య సేవలు చేస్తున్నారు. డాక్టర్లు అమూల్య, మధు, ఆరోగ్య సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నారు.

#### మెరుగైన పారిశుద్ధ్యానికి చర్యలు

కేసానుపల్లిలో పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు చేపట్టారు. గ్రామంలోని మురికి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. ప్రతివీధిలో బ్లీచింగ్ పౌడి చల్లారు. మంచినీటి ట్యాంక్‌లను శుభ్రం చేశారు. మురికికాలువల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టారు. ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. కొన్నిరోజుల పాటు బోర్లలో నీరు వాడవద్దని అధికారులు ప్రజలకు సూచించారు. సర్పంచి శ్రీపతి ప్రసాద్, ఎంపీటీసీ చెట్టిపాగు ఏసుదాసు, నాయకులు నెల్లూరి రామకోటయ్య, పంచాయతీ కార్యదర్శి నాగెండ్ల రత్నం తదితరులు పనులు పర్యవేక్షిస్తున్నారు.

# అరుదైన ఆలయ సందర్శన అదృష్టం

ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు



చాగంటి కోటేశ్వరరావు దంపతులకు జ్ఞాపిక బహూకరిస్తున్న ఆలయ అర్చకులు

తెనాలి: స్థానిక షరాఫ్ బజారులోని శ్రీసువర్చలా సమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామి దేవాలయాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు దంపతులు శనివారం సందర్శించారు. వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. చాగంటి దంపతులు ముందుగా ఆలయంలోని గోమాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పంచముఖ ఆంజనేయస్వామిని దర్శించుకుని, విశేష పూజలు జరిపారు. ఆలయ వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, కిరణ్ ,సురేష్ , వైఖానస పండితులు కలిసి కోటేశ్వరరావు దంపతులను ఆశీర్వదించారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు ఎస్‌బీ శివ, ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి స్వామివారి శేష వస్త్రాలను అందజేశారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ, పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానం ఉజ్జయిని తర్వాత తెనాలిలో అలాంటి అరుదైన దేవాలయాన్ని సందర్శించడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. స్వామి పంచముఖాల దర్శనానికి వీలుగా ఇక్కడ ప్రత్యేక ద్వారాలు ఏర్పాటు చేయటం అద్భుతంగా ఉందన్నారు. ఐదు ముఖాల స్వామి స్వరూపాన్ని దర్శించుకుంటే పరబ్రహ్మ స్వరూపాన్ని దర్శించినట్టేనని తెలిపారు. పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం ఇక్కడ ఉండటం తెనాలి పట్టణ అదృష్టమన్నారు. దేవాలయంలో సువర్చలా అమ్మవారు మూల రూపంలో ఉండటం సంతోషకరమన్నారు. సువర్చలా అమ్మవారికి ముమ్మాటికీ అంజనేయస్వామి పత్నియే అని పేర్కొన్నారు."సువర్చలా,ఆంజనేయ స్వామి కళ్యాణం ఎంతో గొప్పది అన్నారు. దేవాలయంలో వైఖానస సంప్రదాయలో పూజలు నిర్వహించడం అద్భుతమని తెలిపారు. తనకు బహుమతులు ఎవ్వరూ ఇవ్వొద్దని, అందుకు బదులుగా మొక్కలకు నీళ్లు పోయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రెండిళ్లలో బంగారు ఆభరణాల చోరీ



మార్టూరు: మండలంలోని వలపర్లలో తాళాలు వేసిన రెండిళ్లలో దొంగలు 23 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటనలు శనివారం వెలుగు చూశాయి. ఏఎస్ఐ మహబూబ్ బాషా వివరాల మేరకు.. వలపర్ల గరటయ్య కాలనీలో వేర్వేరు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న పరుచూరి సుకన్య, షేక్ మాబులాలు ఈనెల 18న పనుల మీద ఇళ్లకు తాళాలు వేసి వెళ్లారు. మరుసటి రోజు రాత్రి వచ్చి చూడగా తాళాలు ధ్వంసం చేసి బీరువాలను పగలగొట్టి ఉన్న విషయం గమనించారు. సుకన్య ఇంటిలో 11 గ్రాముల బంగారు ఆభరణాలు, మాబులా ఇంటిలో 12 గ్రాముల బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకు పోయారు. ఈ మేరకు వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండిళ్లలో చోరీ జరిగిన తీరును ఏఎస్ఐ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### నేడు సంస్కృతి యువ నాటికలు గ్రంథావిష్కరణ

నగరంపాలెం: ఈనెల 23న 'సంస్కృతి' యువ నాటికలు గ్రంథావిష్కరణ సభ నిర్వహించనున్నట్లు సంస్కృతి వ్యవస్థాపకులు ఎస్.బాలచందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు మార్కెట్ కూడలిలోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సాయంత్రం 6.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. గ్రంథావిష్కరణ అనంతరం ఉన్మాదం యువ నాటిక ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

### యోగా పోటీల్లో ధర్మరాజుకు స్వర్ణపతకం



క్రోసూరు: ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం గుంటూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో క్రోసూరు మండలం అనంతవరం గ్రామానికి చెందిన నక్కా ధర్మరాజుకు స్వర్ణపతకం లభించినట్లు శనివారం తెలిపారు. 60 ఏళ్ల పై విభాగానికి జరిగిన యోగా ప్రదర్శనల్లో ధర్మరాజుకు స్వర్ణపతకంతో పురస్కారం అందచేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకులతో పాటు రాయపాటి శ్రీనివాస్, డొక్కా మాణిక్య వరప్రసాద్, తులసి రామచంద్రప్రభు తదితరులు పాల్గొన్నారు.

### నిమ్మకాయల ధరలు



తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మ కాయలు కనిష్ట ధర రూ.4,800, గరిష్ట ధర రూ.6,500, మోడల్ ధర రూ.5,600 వరకు పలికింది.

# ఉపాధి కూలీలకు బకాయిలు వెంటనే చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఈమని అప్పారావు

లక్ష్మీపురం: ఉపాధి హామీ కూలీలకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు డిమాండ్ చేశారు. శనివారం బ్రాడీపేటలోని సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు అధ్యక్షతన జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో అప్పారావు మాట్లాడుతూ ఇంకా వ్యవసాయ పనులు ప్రారంభం కానందువల్ల కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరారు. గత మూడు నాలుగు వారాలుగా పనిచేసిన కూలీలకు వేతనాలు ఇవ్వలేదని వాటిని వెంటనే చెల్లించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో రాజధాని ప్రాంతంలో సంవత్సరం పొడుగునా ఉపాధి హామీ పనులు కల్పిస్తామని చెప్పారని తెలిపారు. రాజధాని ప్రాంతంలోని వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పించలేదని వాపోయారు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం రాజధాని ప్రాంత వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పించాలన్నారు. పనులు కోసం వలసలు వెళ్లే పరిస్థితిని నివారించాలన్నారు. కౌలు రైతులకు యజమానితో సంబంధం లేకుండా కౌలు కార్డు ఇచ్చే విధంగా చట్ట సవరణ చేయాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామారావు మాట్లాడుతూ గతంలో హై లెవెల్ ఛానల్ పూర్తిచేయాలని రైతు సంఘాలు, కౌలు రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు ఆందోళన నిర్వహించాయని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం హై లెవెల్ ఛానల్ పూర్తి చేయాలని కోరారు. గుంటూరు ఛానల్ కు నిధులు కేటాయించి పూర్తి చేయాలని విన్నవించారు. వ్యవసాయ కూలీలకు కనీస వేతనం అమలు జరిగేటట్లుగా గ్రామాల్లో ప్రభుత్వమే ప్రచారం నిర్వహించాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి .కోటేశ్వరి, శివయ్య, అరుణ తదితరులు పాల్గొన్నారు.

# విజయకీలాద్రిపై వేదభాష్య సభ



వేదభాష్య సభలో పాల్గొన్న దెందుకూరి వెంకటప్ప యజ్ఞ నారాయణ సోమయాజి తదితరులు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై శనివారం వేదభాష్యసభను నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ దెందుకూరి వెంకటప్ప యజ్ఞ నారాయణ సోమయాజి అధ్యక్షతన మీమాంస శాస్త్రం మరియు వేదాంగాలలో చర్చ నిర్వహించామని చెప్పారు. సభలో చింతమనేని ఆంజనేయ ఘనాపాఠి, జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వేద, ఆగమ ఉపాధ్యాయులు పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమ సమన్వయకర్త మంగిపూడి వెంకటశాస్త్రి ఘనాపాఠి మాట్లాడుతూ ప్రతి మాసం ఈ వేద భాష్య సభను నిర్వహించనున్నామని, దాని తర్వాత వేద విద్యార్థులకు వేదాలలోని అర్థాన్ని తెలిపేలా ఈ సభ కొనసాగుతుందని అన్నారు.

# విజ్ఞాన్ వర్సిటీ - సీడాక్‌ల మధ్య అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలను సుదర్శన్‌కు అందజేస్తున్న పీ.నాగభూషణ్, లావు రత్తయ్య తదితరులు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ - బెంగుళూరులోని సీడాక్ (సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్) ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని శనివారం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పీ.నాగభూషణ్ తెలిపారు. సీడాక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌డీ. సుదర్శన్‌తో వర్సిటీ వైస్ చాన్సలర్ పీ.నాగభూషణ్ అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. వైస్ చాన్సలర్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వలన విద్యార్థులకు, అధ్యాపకులకు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, ట్రెనింగ్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ రంగాలలో ప్రత్యేక శిక్షణ లభిస్తుందన్నారు. ఇండస్ట్రీ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆవిష్కరణలను ప్రోత్సహించడంతో పాటు విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రాక్టికల్‌గా అనుభవాలను కల్పిస్తామన్నారు. సీడాక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌డీ.సుదర్శన్ మాట్లాడుతూ విద్యార్థులను సరికొత్త టెక్నాలజీల వైపు ప్రోత్సహించడంతో పాటు వారికి ఆయా రంగాలలో తర్ఫీదునివ్వడమే ఈ ఒప్పందం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సీడాక్ సైంటిస్ట్-ఎఫ్ హరిబాబు, చైర్మన్ లావు రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# రక్తహీనత నియంత్రణకు ప్రభుత్వ చర్యలు



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

శావల్యాపురం: రక్తహీనత నివారణ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా వైద్య ఆరోగ్య బృందం సభ్యులు (టాస్క్‌ఫోర్సు) రావిపాటి వన్నూరు, అదివన్నె నీలకంఠశ్వర రావులు అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లోని విద్యార్థులకు రక్తహీనత (హిమోగ్లోబిన్) వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాతా శిశు మరణాలు నియంత్రణకు రక్తహీనత వైద్య పరీక్షలు ఎంతోగానో దోహదపడతాయన్నారు. చిన్నారులు, కిషోరు బాలికలు, గర్భిణులు, బాలింతలు రక్తహీనత కారణంగా మృత్యువాత పడకుండా ఉండటానికి ప్రభుత్వ ముందు జాగ్రత్త చర్యలు చేపట్టిందన్నారు. రక్తహీనత లోపాలు ఉన్న వారికి ప్రభుత్వ పరంగా మెరుగైన వైద్యసేవలు సకాలంలో అందేలా వైద్య ఆరోగ్య అధికారులు సిబ్బంది బాధ్యత వహించాలన్నారు. రక్తహీనత నమోదు ఆధారంగా అవసరమైన వారికి మందు బిళ్లలు, అత్యవసరమైన వారికి వైద్యులు సూచనలు మేరకు వైద్య సేవలతో పాటు పర్యవేక్షణ చేసి వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా పోషకాహారం అందేలా పర్యవేక్షణ చేస్తారన్నారు. కార్యక్రమంలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రావిపూడి రమ్య, సూపర్‌వైజర్లు అలవలపూడి ఏడుకొండులు, ఉమాదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయ లక్ష్మి, ఆరోగ్య కార్యకర్త ఇంకొల్లు నాగలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు పృథ్వీ రాణి, శంకర్ సింగ్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.